క్లుప్తంగా

వర్షం కోసం ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సింహాద్రిపురం: వర్షం కురవాలని కోరుతూ మండలంలోని గురిజాలలో సోమవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుకుంట్ల సమూహ ఆలయాల వద్దకు బోనాలతో మహిళలు పాదయాత్ర వచ్చి పూజలు జరిపారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది జులై 15 నాటికి ఖరీఫ్ సాగు పూర్తి కావాల్సి ఉందని, సరైన సమయంలో వర్షం పడకపోవడంతో అంతంతమాత్రంగా పంటలు సాగు చేశారని, అందుకే పూజలు చేస్తున్నామని వివరించారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు



మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

కమలాపురం: కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్(102) మృతి కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కామనూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. కమలాపురంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిరువనంతపురంలోని ఎస్‌యూటీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందడం బాధాకరమని, వామపక్ష పార్టీలో చీలిక వచ్చిన తర్వాత సీపీఎంను స్థాపించడంలో అచ్యుతానంద్ ఒకరని ఆయన గుర్తుచేశారు. 2006–11 మధ్య కాలంలో ఆయన కేరళ సీఎంగా బాధ్యతలు చేపట్టారన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

సింహాద్రిపురం: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం (23న) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు.

చంద్రబాబు మోసాలను ఎండగట్టండి



కరపత్రాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాద్రిపురం: చంద్రబాబు సీఎం కుర్చీ ఎక్కడానికి సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలకు మోసం చేసిన వైనాన్ని ప్రతి ఇంటింటికీ వెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి శ్రీకాంత్ రెడ్డి కోరారు. మండలంలోని కోవరంగుంటపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం జరిగిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గడప గడపకూ వెళ్లి బాబు షూరిటీ – మోసం గ్యారంటీని వివరించాలని ఆయన కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, పవన్ చంద్రారెడ్డి, సిలార్, రాజాబాబు, మల్లికార్జున్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ప్రసాద్ యాదవ్, నాగరాజు, పాల్గొన్నారు.

సంగమేశ్వరుడికి పూజలు



పూజలు చేస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

వీరపునాయునిపల్లె: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి సోమవారం అనిమెల సంగమేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం , ఆలయం ఎదుట మరకతగణపతి, సంగమేశ్వరుడికి, పార్వతీదేవికి పూజలు జరిపారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, ఆలయ మాజీ చైర్మెన్ శివాంజనేయరెడ్డి, నరేష్‌రెడ్డి, రాఘవయాదవ్, భాస్కర్‌రెడ్డి, శంభురెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌యాదవ్, గంగిరెడ్డి, నాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

వాహన రికార్డులు తప్పనిసరిగా ఉండాలి

పులివెందుల రూరల్: వాహనదారులు తప్పనిసరిగా తమ వాహన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని అర్బన్ సీఐ చాంద్‌బాషా, ట్రాఫిక్ సీఐ హాజీవలి పేర్కొన్నారు. పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్, పార్నపల్లె బస్టాండు, వెంకటాపురం, వెలమవారిపల్లె రింగ్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైసెన్సులు లేనివారికి, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారికి జరిమానా విధించారు. వారు మాట్లాడుతూ దూరప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. శ్రీనివాసులు, బాషా పాల్గొన్నారు.

నిండుకున్న చెరువులు.. ఎండుతున్న పంటలు

వేముల: గ్రామాలకు పట్టుకొమ్మలు చెరువులు. చెరువులలో పుష్కలంగా నీరు ఉంటే భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బోర్లలో సమృద్ధిగా సాగు నీరు ఉంటుంది. వ్యవసాయ బోర్లు, బావుల కింద పంటలు సాగు చేసుకుని జీవనం సాగించడమే గ్రామీణ ప్రాంత రైతుల ఏకైక మార్గం. అలాంటి చెరువులలో సాగునీరు లేకపోతే రైతులు ఏ విధంగా జీవనం సాగించాలో అర్థంకాని పరిస్థితి. ప్రాజెక్టులలో పుష్కలంగా సాగునీరు ఉన్నా కింది భాగంలో ఉన్న చెరువులు మాత్రం నీరులేక ఎండిపోయాయి. దీనికితోడు వర్షాభావం నెలకొనడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సాగులో ఉన్న పంటలకు నీరెలా అందించాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు సాగునీరు లేక ఎడారిని తలపిస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు విస్తారంగా పంటలు సాగుచేసుకున్నారు. వేముల మండలం వేముల, భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె, మీదిపెంట్ల, వేల్పుల గ్రామాల్లోని మూడువేల ఎకరాలలో అన్ని రకాల పంటలు సాగులో ఉన్నాయి. ఈ గ్రామాల్లో అరటి 2 వేల ఎకరాలు, 370 ఎకరాలలో ఉల్లి, 250 ఎకరాలలో మిరప, 320 ఎకరాలలో టమోటా పంటలు సాగుచేసుకున్నారు. ప్రస్తుతం పంటలు పూత, పిందె దశలో ఉండగా, అరటి గెలలు వేసే దశలో ఉన్నాయి. ఈ సమయంలో నీటి తడులు అందించలేక పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

సకాలంలో వర్షాలు కురవక చెరువులకు నీరందకపోవడం రైతులకు శాపంగా మారుతోంది. బోరు, బావులలో భూగర్భ జలాలు రోజు రోజుకూ అడుగంటిపోతుండడం, రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించినా ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో చెరువులకు నీరు చేరే పరిస్థితి లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలు ఎండిపోతాయనే ఆందోళన రైతులలో వ్యక్తమవుతోంది. వేముల, భూమయ్యగారిపల్లె, వేల్పుల గ్రామాల్లోని చెరువు కింద ఆయకట్టు రైతులు నీటికోసం ఎదురుచూస్తున్నారు. వర్షాభావం నెలకొనడంతో చెరువులకు నీరులేక ఎండిపోతున్నాయి. ఇటీవల కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని చెరువులకు నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. భూమయ్యగారిపల్లె, ఎర్రబల్లె, వేల్పుల చెరువులను నీటితో నింపాలని కోరారు. గ్రామీణ ప్రాంత చెరువుల కింద వేల ఎకరాలలో అరటి తోటలు, ఉల్లి, మిరప, టమోట పంటలు సాగులో ఉన్నాయని, సాగునీరు అందించలేక రైతులు అవస్థపడుతున్నారని, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో అధికారులు ఎర్రబల్లె చెరువుకు నీటిని విడుదల చేశారు. భూమయ్యగారిపల్లె, వేల్పుల, వేముల చెరువులకు ఇంకా నీటిని విడుదల చేయలేదు.



నీరులేక వెలవెలబోతున్న నాయునిచెరువు

బోర్లలో నీరు రాక అవస్థ

చెరువులకు నీటిని విడుదల చేస్తే బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు. నీరు లేక చెరువులు ఎండుతున్నా అధికారులు నీటిని విడుదల చేయడంలో మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. వర్షాభావం నెలకొని కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూమయ్యగారిపల్లె, వేల్పుల చెరువులకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తారు. లింగాల కుడి కాలువ నుంచి వేములలోని నాయుని చెరువుకు నీటిని తరలించి అక్కడ ఉన్న పంప్‌హౌస్ నుంచి భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె చెరువులకు ఎత్తిపోతల ద్వారా తరలిస్తారు. వేములలోని నాయుని చెరువు నుంచి భూమయ్యగారిపల్లెలోని సంపుకు తరలించి భూమయ్యగారిపల్లె గంగమ్మకుంట చెరువు, ఎర్రకుంట చెరువులకు నీటిని తరలిస్తారు. వేములలోని నాయుని చెరువులో నీరులేక ఎత్తిపోతల ద్వారా భూమయ్యగారిపల్లె చెరువులకు నీటిని అందించలేదు. మరిన్ని రోజులు వర్షాలు లేక చెరువులకు నీరు రాకపోతే తీవ్ర ఇబ్బందులు పడతామని రైతులు అంటున్నారు.



భూమయ్యగారిపల్లె వద్ద సాగులో ఉన్న అరటి తోట

పంటలు ఎండితే నష్టపోతాం

సాగులో ఉన్న పంటలు ఎండితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి అరటి, ఉల్లి, టమాటాపంటలను రైతులు సాగు చేసుకున్నారు. ఈ పంటలకు సకాలంలో సాగునీరిచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు అరటి పంటకు ప్రతి రోజూ నీటిని ఇవ్వాల్సి ఉంటుందని, ఒక రోజు ఇవ్వకపోయినా తోటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలకు సాగు నీరు ఇవ్వక ఎండిపోతే నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులను ఆదుకునేందుకు అధికారులు చొరవ చూపి చెరువులకు సాగునీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉంది. అధికారులు చొరవ చూపి చెరువులకు సాగునీటిని విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి



వర్షాభావంతో వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్లలో నీరు తగ్గిపోవడంతో పంటలకు సాగునీరు ఇవ్వలేకున్నాం. నీరివ్వడంలో ఆలస్యమైతే అరటి పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రతి రోజూ అరటికి సాగునీరు ఇవ్వాల్సిందే. వర్షాలు లేక, చెరువులకు నీరు విడుదల చేయకపోతే బోర్లు పూర్తిగా ఎండిపోతాయి.

– మలకుంట్ల రామగంగిరెడ్డి, అరటి రైతు, భూమయ్యగారిపల్లె

చెరువులను సాగునీటితో నింపండి



వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉన్న చెరువులను సాగు నీటితో నింపండి. ప్రాజెక్టులలో నీరు ఉన్నా చెరువులకు నీటిని విడుదల చేయడంలో అధికారులు చొరవ చూపలేదు. పంటలు ఎండిపోయాక నీటిని వదిలినా ప్రయోజనం ఉండదనే విషయం గ్రహించి సకాలంలో నీటిని వదలండి. దీని ద్వారా వాగులు, వంకలు ప్రవహించి బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయి.

– నాగూరు జయరామిరెడ్డి, అరటి రైతు, భూమయ్యగారిపల్లె

పులివెందులపై కూటమి నేతల వివక్ష

– కమిషనర్‌కు చైర్మన్, కౌన్సిలర్ల వినతి



కమిషనర్‌కు విన్నవిస్తున్న చైర్మన్, తదితరులు

పులివెందుల టౌన్: పులివెందులలో ఇంజినీర్ల కొరత ఉండడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి.. ఇంజినీర్ల కొరతతో అభివృద్ధి పడకేసింది.. పులివెందులపై కూటమి నాయకులు నిర్లక్ష్యం చూపుతున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ రాముడును సోమవారం వరప్రసాద్‌తోపాటు వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మీ భార్గవి, ఖాదర్ భాషా, పురుషోత్తం , కోఆప్షన్ మెంబర్ దాసరిచంద్రమౌళి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్, డివిజనల్ ఇంజినీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో అత్యవసరమైన పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. పట్టణంలో వీధి దీపాలు, డ్రైనేజీ, మూతల కొరత ఎక్కువగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కింద రెండు అవార్డులు పులివెందులకు వచ్చాయని గుర్తు చేశారు. టెండర్ పూర్తయిన పనులకు అగ్రిమెంట్లు చేయాలన్నా ఇంజినీర్లు లేరన్నారు. పులివెందుల మున్సిపాలిటీపై కూటమి ప్రభుత్వానికి ఎందుకంత చిన్నచూపు అని వారు ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కాబట్టే కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అర్థమవుతోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మున్సిపాలిటీలో అధికారులను నియమించాలని, ఉన్నతాధికారులు స్పందించకపోతే పర్యవసానం మరోలా ఉంటుందని హెచ్చరించారు. కొండయ్య, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో చంద్రబాబు నయవంచన

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.నరేన్ రామాంజులురెడ్డి

పెండ్లిమర్రి: సూపర్ సిక్స్ హామీలతో అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబునాయుడు వంచించారని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్‌రామాంజులరెడ్డి మండిపడ్డారు. మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ పై సోమవారం సాయంత్రం ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో తప్పుడు హామీలిచ్చి ప్రజలను నిలువునా మోసం చేశాడన్నారు. ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రతి కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో ప్రజలకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, నాగేంద్రారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, వీరారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శివ, శ్రీను పాల్గొన్నారు.



కొత్తగంగిరెడ్డిపల్లెలో పర్యటిస్తున్న నరేన్ రామాంజులురెడ్డి

రీసర్వే త్వరితగతిన పూర్తిచేయాలి

జమ్మలమడుగు రూరల్: భూముల రీసర్వే త్వరితగతిన పూర్తిచేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ అదిమూలం సాయిశ్రీ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు సంబంధించి రీసర్వే నవంబరు 30వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. డిసెంబరు నుంచి పట్టా భూములకు సంబంధించి సర్వే చేయాలని సర్వేయర్లను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి ఇక్బాల్‌బాషా, డివిజన్ సర్వేయర్ హరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

బాబు మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తొండూరు: ఎన్నికల వాగ్దానంలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు మ్యానిఫెస్టో విడుదల చేసి ప్రజలను మోసం చేశారని తొండూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమిరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమ కరపత్రాలను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి టీడీపీ ప్రభుత్వంలో ఎంత నష్టపోయారు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంత లబ్ది పొందారనేది వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బండి రామమునిరెడ్డి, దశరథరామిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, జయశంకర్, గోపాల్, వెంకటరెడ్డి, శ్రీను, గంగరాజు, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న మండల నాయకులు

ఈ పంట నమోదు తప్పనిసరి చేశాం

కమలాపురం: కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి అన్నారు. మండలంలో జరుగుతున్న ఖరీఫ్–2025 ఈ–పంట నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని రైతులు ఈ నెల 23వ తేదీలోపు గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని రైతులు ఈ నెల 23వ తేదీలోపు గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే మినుము, ఉల్లి పంటలకు ఈ నెల 30వతేదీలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. వరికి మాత్రం ఆగస్టు 13వతేదీ వరకు గడువు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరస్వతి, ఏఈఓలు పాల్గొన్నారు.



ఈ–పంట నమోదు పరిశీలిస్తున్న ఏడీఏ

సోలార్ సబ్సిడీపై అవగాహన కల్పించండి

పులివెందుల రూరల్: సోలార్ సబ్సిడీ విధానంపై విద్యుత్తు వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం చీఫ్ మేనేజర్ ఆర్ ఏసీ ఐపీసీ శోభ వాలంటియన్ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక అంబకపల్లె రోడ్డులో ఉన్న విద్యుత్ డివిజన్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ పథకంపై నియోజకవర్గంలోని ఏడీలు, ఏఈలు సబ్ ఇంజినీర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పీఎం సూర్యఘర్ ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకుని.. బిల్లులు తగ్గించుకునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడపకు చెందిన టెక్నికల్ ఆఫీసర్ మధు, టెక్నికల్ ఏఈ కమర్షియల్ జేఈలు, పులివెందుల ఈఈ ప్రసాద్ రెడ్డి, ఏడీలు గురు మోహన్ రెడ్డి, జయ సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, ఏఏఓలు, సబ్ ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.



సోలార్ సబ్సిడీ విధానంపై అవగాహన కల్పిస్తున్న చీఫ్ మేనేజర్ శోభ వాలంటియన్

మైనర్లు వాహనాలు నడపరాదు

వేంపల్లె: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ నరసింహులు పేర్కొన్నారు. వేంపల్లె బైపాస్ రోడ్డులో సోమవారం వాహనాలు ఆయన తనిఖీ చేశారు. అధిక లోడుతో వెళ్లుతున్న ఆటో నిలిపి రికార్డులను తనిఖీ చేసి జరిమానా విధించారు. ఆటోలలో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తే డ్రైవర్ల లైసెన్స్‌లను రద్దు చేయడం జరుగుతుందన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు



జరిమానా విధిస్తున్న శానిటరీ సెక్రటరీలు

పులివెందుల టౌన్: ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా తప్పదని సచివాలయ శానిటరీ సెక్రటరీలు విష్ణు, కృష్ణారెడ్డి, నటరాజ్ పేర్కొన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లోని పలు దుకాణాలను సోమవారం వారు తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో వాడుతున్న ప్రభుత్వ నిషేధిత సింగిల్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను సెక్రటరీలు స్వాధీనం చేసుకున్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

కొండాపురం: గ్రామాల్లో గ్రామస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ లక్ష్మీదేవి అధికారులను అదేశించారు. మండల కేంద్రంలోని వెలుగు సభా భవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ నాగప్రసాద్ మాట్లాడుతూ అజెండాలో అంశాల వారీగా అధికారులు తమ పురోగతి వివరించాలని సూచించారు. తమ గ్రామాల్లో చేతిపంపులు మరమ్మతు చేయించాలని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్ స్పందిస్తూ మెకానిక్‌ను పిలిపించి చేతి పంపులు మరమ్మతు చేయిస్తామని తెలిపారు. నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా ఆర్వో ప్లాంట్లు నడుపుతున్నారని ఏఈ తెలిపారు. సంకేపల్లెలో ట్యాంకుకు గంటపాటు నీటిని విడుదల చేస్తున్నారని, అవి సరిపోక జనం తోటల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారని ఆరోపించారు. కొత్తపల్లె పంచాయతీలో వీధిదీపాలు పనిచేయడంలేదని లైన్‌మెన్‌కు చెప్పినా.. స్పందించలేదని సర్పంచ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వీధి దీపాలు వెలిగేలా చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీలు చంద్రశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఎవో రామంజుల్‌రెడ్డి, ఎంఈఓ రామయ్య, ఏఈ వీరారెడ్డి పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు

పెద్దకాంపల్లె గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన

చింతకొమ్మదిన్నె: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలం లోని పెద్దకాంపల్లె గ్రామంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సోమవారం పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై ప్రభుత్వ కార్యక్రమాలు, అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం గ్రామంలో తిరిగి ప్రజలను పథకాల గురించి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నాగిరెడ్డిపల్లె పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జిగా గంధం మోహన్‌బాబు ఎంపికయ్యారు. నాగిరెడ్డిపల్లె పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే, నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు రైతు సేవా కేంద్రం తనిఖీ

వల్లూరు(చెన్నూరు): చెన్నూరు రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వలు పరిశీలించి రైతులకు ఎరువుల బస్తాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అవసరమైన దానికంటే యూరియా ఎక్కువ వేస్తున్నారని, దీంతో భూసారం దెబ్బతింటుందన్నారు. దుక్కిలో పొటాష్ ఎరువు తప్పనిసరిగా వేసుకోవాలని తెలియజేశారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్.గోవర్ధన్, శ్రీదేవి, రెడ్డి నాగేశ్వరి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ చంద్రానాయక్

మైనర్లకు అద్దె రూములు ఇస్తే కఠిన చర్యలు

జమ్మలమడుగు రూరల్: పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఇక మీదట మైనర్ బాల, బాలికలకు లాడ్జింగ్ యాజమానులు అద్దెగదులు ఇస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. పట్టణ సీఐ ఎస్.లింగప్ప ఆధ్వర్యంలో గండికోట అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అకాడమీలో లాడ్జి యాజమానులతో సమావేశం జరిగింది. కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ పర్యాటకులు వచ్చినప్పుడు అధార్ కార్డ్, ఫోన్ నెంబర్లు, తదితర సమాచారం లాడ్జింగ్ యాజమానులు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రాత్రి 9 గంటలకు పోలీస్ ఔట్ పోస్ట్‌లో పర్యాటకుల వివరాలను అందజేయాలని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించండి

వేంపల్లె: వేంపల్లెలో ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతిలో టీటీడీ పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డిని సోమవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ వేంపల్లెలో ప్రారంభానికి నోచుకోని టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించాలన్నారు. వృషభా చలేశ్వరస్వామి దేవస్థానంలో నాయీ బ్రాహ్మణులను నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న గండి ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి భక్తులకు మూలవిరాట్ దర్శనాన్ని కల్పించాలన్నారు. గండి క్షేత్రానికి టీటీడీ నుండి రావాల్సిన బంగారు, వెండితోపాటు లడ్డూ ప్రసాదం తయారు చేయడానికి పోటు నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చేయించాలన్నారు. దీనిపై టీటీటీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డిని కోరగా మంగళవారం జరిగే పాలకమండలి సమావేశంలో చర్చించి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, దొంతు సుమన్, ఎర్రబోయిన రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.



భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు